క్లుప్తంగా

వేడుకగా గురురాఘవేంద్ర ఆరాధన



ప్రత్యేక అలంకరణలో గురు రాఘవేంద్రస్వామి

ఒంగోలు మెట్రో: ఒంగోలు సంతపేట గురురాఘవేంద్ర స్వామి 354వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ అర్చకుడు గురురాఘవేంద్ర స్వామికి అభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ చేసి అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం మంత్రాలయంలో జరిగిన విధంగా ఈ దేవస్థానంలో కూడా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

విద్యార్థులు ప్రణాళికాయుతంగా సన్నద్ధం కావాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేనేజ్‌మెంట్ సభ్యులు

ఒంగోలు సిటీ: ఇంజినీరింగ్ విద్యా ఫలాలను పూర్తిగా ఆస్వాదించడానికి విద్యార్థులు మొదటి నుంచే ప్రణాళికాయుతంగా సన్నద్ధం కావాలని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల క్లాసుల ప్రారంభ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శిద్దా హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. అనంతరం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు తమ వ్యవహారాల్లో హుందాతనానికి ప్రాధాన్యత నివ్వాలని గ్రూప్ ట్రెజరర్ శిద్దా భరత్ అన్నారు. వసతుల కల్పనలో ముందున్న రైజ్ కృష్ణసాయి గ్రూప్, తల్లిదండ్రులు, విద్యార్థుల ప్రాధాన్యతను గౌరవిస్తుందని గ్రూప్ కార్యనిర్వాహక చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్ అన్నారు. కార్యక్రమంలో గ్రూప్ డైరెక్టర్ డాక్టరు ఏవీ భాస్కరరావు, మేనేజ్‌మెంట్ సభ్యురాలు శిద్దా ప్రవల్లిక, ప్రిన్సిపాల్ డాక్టరు కేవీ సుబ్రహ్మణ్యం, విభాగాధిపతులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేవీ పాలేనికి త్వరలో సాగర్ జలాలు



తాగునీటి పథకం పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

చీమకుర్తి రూరల్: కేవీ పాలెం ఎస్సీ కాలనీ ప్రజలకు త్వరలో తాగునీరు సమస్య తొలగనుందని.. త్వరలో గ్రామానికి సాగర్ జలాలు అందుతాయని వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కేవీ పాలెం గ్రామంలో క్రిస్టియన్ పాలెం, అంబేడ్కర్ నగర్ రెండు కాలనీలలో ఉన్న మెయిన్ రోడ్డు అంతర్గత రోడ్డులను స్థానిక మండల గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారిని శాంతి ప్రియ, కాంట్రాక్టర్ హరిబాబులతో కలసి తాగునీటి పథకం పనులు పరిశీలించారు. ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి ఎస్సీ కాలనీకి నూతన పైపులైన్ల నిర్మాణం కోసం జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బీఎస్ విజయకుమార్ చొరవతో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ రూ.10 లక్షలు జిల్లాపరిషత్ నిధులు మంజూరుచేశారని చెప్పారు. పథకం పనులు త్వరలో పూర్తి అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కల్పించడంలో వైఫల్యం

ఒంగోలు టౌన్: పౌరులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించడంలో పాలకులు పూర్తిగా వైఫల్యం చెందారని ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు విమర్శించారు. మంగళవారం స్థానిక ఆచార్య రంగా భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ పౌరులకు రాజ్యాంగం పై సమగ్రంగా అవగాహన వస్తే ఎక్కడ నిలదీస్తారన్న భయంతోనే పాలకులు ఉద్దేశ పూర్వకంగానే రాజ్యాంగాన్ని అందుబాటులో ఉంచలేదన్నారు. రాజ్యాంగానికి పీఠిక ఆత్మ వంటిదన్నారు. సార్వభౌమ, సర్వసత్తాక, లౌకిక, సామ్యవాద పదాలను అందరికీ అర్థం అయ్యేలా ప్రచారం చేయాలన్నారు. పౌరులంతా బాధ్యతగా వ్యవహరిస్తూ పాలకులను ప్రశ్నిస్తుంటే దుర్మార్గపు పాలన అంతమవుతుందని చెప్పారు. రాజ్యాంగంపై అవగాహన కోసం మార్చి నెల నుంచి వందకు పైగా పాఠశాలలు, 16 కాలేజీలు ,3 డిగ్రీ కాలేజీలను సందర్శించినట్లు తెలిపారు. జులై 20 నుంచి 26వ తేదీ వరకు రాజ్యాంగంపై వ్యక్తృత్వ పోటీలను నిర్వహించామని, స్వాతంత్య్ర దినోత్సవం రోజు నిర్వహించే కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. సమావేశంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు, పేరయ్య, గడ్డం మురహరిరావు, ఎల్ రాజశేఖర్, భీమవరపు సుబ్బారావు, ఎంఏ సాలార్, నక్క అయ్యన్న, చల్లా సింగయ్య తదితరులు పాల్గొన్నారు.



మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిలిచిన నీరు



వానకు తడుస్తూ సైకిళ్లపై ఇంటికి వెళ్తున్న చిన్నారులు

వాన కురిసింది.. నగరం నవ్వింది !



జాగ్రత్త చెల్లెమ్మ: బస్టాండ్ వద్ద నీరు నిలబడటంతో జాగ్రత్త రోడ్డు దాటుతున్న యువతులు



నగరంలో కురుస్తున్న వాన

సాక్షినెట్‌వర్క్: బంగాళఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా ఒంగోలు నగరం తడిసి ముద్దయింది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి వర్షాలు ముసురు పట్టి కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా మూడు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఒంగోలు నగరంలో నగరంతో పాటు పరిసర ప్రాంత మండలాల్లో మధ్యలో ఖాళీ ఇస్తూ ఆగి ఆగి జల్లులతో కూడిన వర్షం పడుతోంది. ఒంగోలులో చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయంగా మారాయి. వర్షపు నీరు సులువుగా వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దాంతో రిమ్స్ హాస్పిటల్ ఎదురుగా మెయిన్ రోడ్లో మోకాలు లోతు నీళ్లు నిలబడ్డాయి. వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. బస్టాండ్ సెంటర్లలో కూడా అదే పరిస్థితి. బుధ, గురు వారాల్లో వివాహ ముహూర్తాలు దండిగా ఉన్నాయి. వర్షం కారణంగా శుభకార్యాలకు కొంత అసౌకర్యంగానే మారింది.

వర్షానికి ఎంపీడీవో ఆఫీస్ మునక

మద్దిపాడు: మండల కేంద్రంలోని కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పూర్తిగా నీట మునిగింది. అల్పపీడన ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షంతో పూర్తిస్థాయిలో రెండు అడుగుల మేరకు నీరు చేరింది. జాతీయ రహదారి పక్కన సైడు కాల్వలు నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గతంలో పలుమార్లు ఈ విషయంపై పత్రికల్లో వార్తలు వచ్చిన పట్టించుకున్న నాథుడే లేడు. దీనితోపాటు మద్దిపాడు ఫ్లైఓవర్ తూర్పు వైపున సుమారు 100 మీటర్ల మేర నీరు చెరువులను తలపిస్తూ ప్రవహించింది.



బస్టాండ్ వద్ద మోకాలు లోతులో సైకిల్ మీద వెళ్తున్న విద్యార్థి



బస్టాండ్ వద్ద మోకాలు లోతులో నీరు ఉండటంతో ఇబ్బందులు పడుతున్న ద్విచక్రవాహనదారులు

ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోతాం



డీటీకి అర్జీ అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): కూటమి ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ పథకం అమలైతే ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతారని.. వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో కార్మికులకు బాడుగలు తగ్గి కుటుంబ పోషణ భారంగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా వాహనమిత్ర పథకం ద్వారా సంవత్సరానికి రూ.25000 ఇచ్చి ఆటో కార్మికులు ఆదుకోవాలని, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని డిమాండ్ చేశారు. వాహనాలు కొనుగోలుకు సబ్సిడీ రుణాలు ఇపిచాలని ఆటో కార్మికులను ఆదుకోవాలని డీటీ రఫీకి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో మండల ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసాద్, శ్రీను, రహంతుల్లా, బసవయ్య సుబ్బారావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఏకేయూలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



ఏకేయూలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: స్వాతంత్య్ర సమర యోధుల త్యాగాలను స్మరించుకోవాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలామణి తెలిపారు. మంగళవారం యూనివర్సిటీ ప్రాంగణంలో వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ హరిబాబుల సూచనల మేరకు విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది జాతీయ జెండాలను చేతపట్టుకొని స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, భారత మాతాకీ జై.. అంటూ నినదిస్తూ ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో కలియతిరిగారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఆనాటి స్వాతంత్రోద్యమ కాలంలో ఎందరో త్యాగధనులు అశువులు బాశారని, వారి కృషి ఫలితమే ఈనాడు అఖండ భారతావనిలో ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్య్రలతో జీవిస్తున్నారన్నారు. నేటి యువతరం కూడా భారతావనిలో అభివృద్ధి, సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఆగస్టు 15న యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే స్వాతంత్య్ర దిన వేడుకల్లో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ ఏ. భారతీ దేవి, ఎన్.ఎస్.ఎస్. కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఒడా చైర్మన్‌గా రియాజ్

ఒంగోలు సబర్బన్: ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్‌గా కూటమి పార్టీలోని జనసేన జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.రియాజ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి ఏ పదవిపై జిల్లాలోని అనేక మంది కూటమి పార్టీల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన అనేక మంది నాయకులు ఆశలు పెట్టుకున్నారు. చివరకు ఆ పదవి రియాజ్ వశమైంది. ఇప్పటి వరకు జేసీ ఆర్.గోపాల కృష్ణ ఎక్స్ అఫీషియో వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

మద్దిపాడు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ ఆనందమోహన్ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడమే కాకుండా ఇంటిలోని వారికి చుట్టు పక్కల వారికి తెలియజేయాలన్నారు. వ్యక్తి గత పరిశుభ్రత పాటించకపోతే వచ్చే అనర్థాలను ఆయన వివరించారు. పొట్టలో చేరే నులిపురుగుల వలన రక్తహీనత, ఏర్పడి పలు రకాల జబ్బులు వచ్చే ఆవకాశాలు ఉన్నాయన్నారు. 17 ఏళ్ల లోపు వారు ప్రతి ఒక్కరూ నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రను వేసుకోవాలని ఆయన తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ సెంటర్‌లలో మొత్తం 9367 మంది కి మాత్రలు వేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని అందులో 9038 మందికి మాత్రలు అందించినట్లు ఆయన తెలిపారు(96.5 శాతం) కార్యక్రమంలో ఆయన వెంట ప్రిన్సిపాల్ అధ్యాపకులు, ఆసుపత్రి సీహెచ్‌ఓలు లలితమ్మ, రజిత కుమారి, సూపర్వైజర్ బాలకోటయ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నం: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా కొత్తపట్నం, ఈతముక్కల పీహెచ్ పరిధిలో మంగళవారం నులిపురుగుల మందులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఉన్న 15 పంచాయతీల్లో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మాత్రలు వేశామన్నారు. రెండు పీహెచ్‌సీ సెంటర్‌ల పరిధిలో 9,682 మందికి మాత్రలు వేశామన్నారు.

ఆరోగ్యకరమైన ఆలోచనలతో ఆరోగ్యం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ, అధికారులు

ఒంగోలు టౌన్: ఆరోగ్యకరమైన ఆలోచనలతో ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం జాతీయ యూత్ డేని పురస్కరించుకొని జిల్లా టీబీ అధికారిణి డాక్టర్ వాణితో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులు, మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వారానికి ఒక అంశం ప్రకారం 8 వారాల పాటు ఎనిమిది అంశాలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. జిల్లాలోని 200 గ్రామాలు, 400 స్కూళ్లు, 86 కాలేజీలతోపాటుగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయనున్నట్లు వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని, భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అనంతరం పచ్చ జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డ్యాప్ క్యూ చంద్రమోహన్, గ్రో టీఐ పీర్ బాషా, షేర్ ఇండియా పీఓ షేక్ అమీన్, కో ఆర్డినేటర్ సాయి, లింక్ వర్కర్ జిల్లా రిసోర్స్ పర్సన్ స్వరూప్ కుమార్, గ్రాండ్ టీఐ పీఎం కోటేశ్వరరావు, ఎస్ఎస్ఐఆర్డీ పీఎం వెంకటేశ్, ఎంఎల్ఎల్ రమేష్, ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ అధ్యాపకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని నింపేందుకే హర్ ఘర్ తిరంగా



మాట్లాడుతున్న జేసీ ఆర్ గోపాలకృష్ణ, పక్కన డీఆర్ఓ, మెప్మా పీడీ

ఒంగోలు సబర్బన్: ప్రతి ఒక్కరిలో దేశ భక్తిని పెంపొందించేలా జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ అన్నారు. ఒంగోలులోని ఎన్‌టీఆర్ కళా క్షేత్రంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి జేసీ ఆర్ గోపాల కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో ముఖ్యంగా యువతలో దేశ భక్తిని నింపడంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నదే హర్ ఘర్ తిరంగా కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఎందరో మహనీయుల త్యాగఫలితమే మనకు స్వాతంత్య్రం వచ్చిందని, వారిని పేరు పేరునా వారి త్యాగాలను మనం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో భాగస్వాములై దేశ భక్తిని, ఔన్నత్యాన్ని చాటుతూ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జాతీయ పతాకంతో ర్యాలీలు నిర్వహిస్తూ పెద్ద ఎత్తున హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా దేశభక్తిని పెంపొందించేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న, మెప్మా పీడీ శ్రీహరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కుమార్, జాన్సన్, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయంలో నక్ష సర్వే పూర్తిచేయాలి

ఒంగోలు సబర్బన్: నగరంలో చేస్తున్న నక్ష సర్వేని నిర్దేశిత సమయం లోపల పూర్తిచేయాలని ఒంగోలు నగర కమిషనర్ వార్డు సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన కార్యాలయ ప్రాంగణంలోని కౌన్సిల్ హాలులో మంగళవారం ఇతర అధికారులతో కలిసి సమేవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ సకాలంలో సర్వే పూర్తి చేస్తే ఒంగోలు నగర పాలక సంస్థకు రూ. 50 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకం రూపేణా అందజేస్తుందన్నారు. ఆ నిధులతో ఒంగోలు నగరంలో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టవచ్చన్నారు. సర్వే పూర్తిచేయడానికి ఇంకా 30 రోజులు మాత్రమే గడువు ఉందిని, కనుక సచివాలయ సెక్రటరీలు అందరు కూడా టీం వర్క్‌తో పనిచేసి ఈ నక్ష సర్వేని పూర్తి చేయాలన్నారు. నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నక్ష సర్వేని త్వరగా పూర్తిచేయటానికి ప్రతి సచివాలయంలో 5 మంది సెక్రటరీలను ఒక టీంగా ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ప్రతి సెక్రటరీ కూడా ఈ సర్వేలో వారి బాధ్యతను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుధాకరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాబురావు, సర్వేయర్ ఆవుల శ్రీనివాసరావు, అన్ని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ తగిలి యువకుడి మృతి

మద్దిపాడు: లారీ నుంచి విద్యుత్ స్తంభాలు అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో ప్రమాదం సంభవించి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మద్దిపాడు మండలంలోని వెంకట్రాజుపాలెం సమీపంలో ఉన్న ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌లో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలోని గిరిజవోలు గ్రామానికి చెందిన రాయనూతల సురేష్(30) వెంకట్రాజుపాలెం వద్ద ఉన్న వెంచర్‌లో విద్యుత్ స్తంభాలు దింపడానికి లారీలో వచ్చాడు. స్తంభాలను కిందకు దించే క్రమంలో వాటికి కట్టిన చైన్ తెగి విసురుగా వచ్చి సురేష్ తల భాగంలో తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. వెంచర్‌లోని కూలీలు ప్రమాద విషయాన్ని మద్దిపాడు పోలీసులకు తెలియజేశారు. మృతుడికి వివాహమై భార్య ఉన్నట్లు సమాచారం. మద్దిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం..

ఒంగోలు టౌన్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను మోసం చేశాడని ఓ యువతి తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం .. మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన పాలిపోగు అశోక్ ఒంగోలులోని ఒక కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అతడికి నగరంలోని సత్యనారాయణపురానికి చెందిన ఓ యువతి పరిచయమైంది. గత కొన్నాళ్లుగా వారిద్దరూ సన్నిహితంగా మెలుగుతూ శారీరకంగా కలిశారు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని ఆ యువతి అడగడంతో అశోక్ తిరస్కరించాడు. దాంతో ఆ యువతి తాలుకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికులను ఓటేయకుండా పోలీసులే అడ్డుకోవడం దుర్మార్గం



బొట్ల సుబ్బారావు

ఒంగోలు సిటీ: పులివెందుల, ఒంటిమిట్టల్లో జరుగుతున్న ఉప ఎన్నికల్లో స్థానికులను పోలీసులు ఓట్లు వేయకుండా అడ్డుకోవడం దుర్మార్గమని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు మంగళవారం అన్నారు. కేవలం పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీలు చనిపోయిన సభ్యులతో వచ్చిన ఉప ఎన్నిక గెలుపు కోసం సీఎం చంద్రబాబు ఈ వయసులో ఇంత దిగజారి బరితెగించి మరి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు. ఈ ఉప ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేసి మంత్రులను పంపించి టీడీపీ గుండాలతో దొంగ ఓట్లు వేయించిందన్నారు. పోలీసు వ్యవస్థతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను బైండోవర్ చేయించి, నాయకులను హౌస్ అరెస్టు చేయించి నిస్సిగ్గుగా ఎన్నికలు నిర్వహించారని ధ్వజమెత్తారు. రాష్ట్రం యావత్తు మీడియా ద్వారా అక్కడ జరిగిన పరిణామాలు చూసి నివ్వెర పోయారన్నారు.పోలీసులే స్థానికులను బూత్‌ల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం, పక్క నియోజకవర్గ టీడీపీ మూకలు చేరి దొంగ ఓట్లు వేశారన్నారు. ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికలు నోటిఫికేషన్ ఇచ్చింది మొదలు అక్కడ ప్రచారానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిల మీద దాడి చేయడం, వైఎస్సార్ సీపీ నాయకులను బెదిరించడం, భారీగా డబ్బు, చీరలు పంపిణీ చేశారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్ చిత్తశుద్ధి ఉంటే ఈ ఎన్నికలను రద్దుచేసి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు



సీసీఎల్ఏ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాజముద్రతో తయారు చేసిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి కలెక్టర్‌కు సూచించారు. విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి మంగళవారం అన్నదాత సుఖీభవ, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, కాస్ట్ సుమోటో డ్రైవ్, డిసిప్లినరీ కేసులకు సంబంధించి ఎంక్వయిరీ పెండెన్సీ, జాయింట్ ఎల్‌పీఎం సమస్యకు పరిష్కారం, తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో చేపట్టిన రీ సర్వే ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రెవెన్యూ శాఖలో డిసిప్లినరీ కేసులకు సంబంధించి ఎంక్వయిరీ పెండెన్సీని త్వరగా పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు సంబంధించి జాయింట్ ఎల్‌పీఎం సమస్యలకు పరిష్కారం చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ బాషా, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సిబ్బంది తదితరులు తదితరులు పాల్గొన్నారు.